# సాక్షి వికారాబాద్

గురువారం । 6 । మార్చి । 2025







**వంద శాతం దిశగా..**

దోమ మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. 8లో▸



**సబ్బండ వర్గాల అభ్యున్నతికి..**

సబ్బండ వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸




## న్యూస్‌రీల్

### తాగునీటి సమస్య రావొద్దు

**డీపీఓ జయసుధ**



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ జయసుధ

**నవాబుపేట:** ఎండలు ముదురుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డీపీఓ జయసుధ ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే ఎండల తీవ్రత పెరిగినందున గ్రామాల్లో నీటి సమస్యలు వచ్చే అవకాశం లేకపోలేదన్నారు. ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు ముందుస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇలాగే ఇంటి, ఇతర పన్నులు వంద శాతం వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను ఉపయోగించుకొని ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విధులకు డుమ్మా కొడితే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనురాధ, ఎంపీఓ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### నీటి సంరక్షణ పనులు భేష్

**ప్రొఫెసర్ లతీఫ్ పాషా**



గోవిందాపూర్‌లో కుంటను పరిశీలిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

**మోమిన్‌పేట:** మండలంలో నీటి సంరక్షణ పనులు బాగున్నాయని, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తేనే అవగాహన కలుగుతుందని ప్రొఫెసర్ లతీఫ్ పాషా అన్నారు. బుధవారం మోమిన్‌పేట మండలం గోవిందాపూర్, వెల్‌చాల్ గ్రామాల్లో చేపట్టిన నీటి సంరక్షణ పనులను రాజేంద్రనగర్ తెలంగాణ జయశంకర్ విశ్వవిద్యాలయం అగ్రోనమి విభాగ విద్యార్థులు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో వాటర్ షెడ్ పనుల్లో భాగంగా నీటి కుంటలు, చెక్ డ్యాంలు నిర్మించారని తెలిపారు. వర్షం కురిసినప్పుడు వరద నీరు వృథాగా దిగువకు వెళ్లకుండా వాలుకు అడ్డంగా చెక్ డ్యాంలు, నీటి కుంటలు నిర్మించినట్లు తెలిపారు. తద్వార నీరు ఇంకి భూగర్భ జలాలు పైకి వస్తాయన్నారు. వ్యవసాయానికి, పశువులకు నీరు పుష్కలంగా దొరుకుతుందని చెప్పారు. అంతే కాకుండా వాలుకు అడ్డంగా రాతి కట్టలు కట్టడం ద్వారా భూమి కోతకు గురికాదన్నారు. కార్యక్రమంలో ఏఈఓ పెంటయ్య, వాటర్ షెడ్ అధికారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పోచయ్య రైతులు పాల్గొన్నారు.

### హాల్ టికెట్ అందజేతలో ఆలస్యం

**పరీక్ష మిస్సయిన ఇంటర్ విద్యార్థి**



పరీక్ష కేంద్రం బయట విద్యార్థి నాగేశ్

**పరిగి:** కళాశాల ఫీజు కట్టకట్టలేదనే కారణంతో సకాలంలో తనకు హాల్ టికెట్ ఇవ్వలేదని, దీంతో పరీక్ష రాయలేకపోయానని ఇంటర్ ఓ విద్యార్థి వాపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని శ్రీసాయి ఒకేషనల్ జూనియర్ కాలేజీలో నాగేశ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఫస్టియర్ బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు రాసేందుకు మంగళవారం హాల్ టికెట్ కోసం కళాశాలకు వెళ్లాడు. ఫీజు చెల్లించని వారు తర్వాత రావాలని సిబ్బంది సూచించడంతో సాయంత్రం వేళ ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం కాలేజీకి వెళ్లి హాల్ టికెట్ తీసుకుని, సెంటర్‌కు చేరుకునే సరికి సమయం 9:20 కావచ్చింది. దీంతో నిర్వాహకులు అతన్ని పరీక్షకు అనుమతించలేదు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తాను పరీక్ష మిస్సయ్యానని బాధితుడు ఆరోపించాడు. ఆ విషయంపై ప్రిన్సిపల్ శ్రీశైలంను వివరణ కోరగా.. విద్యార్థి ఉదయం 8:55 నిమిషాలకు హాల్‌టికెట్ కోసం వచ్చాడని, దీంతోనే ఆలస్యం జరిగిందని తెలిపారు.



తాండూరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బారులు తీరిన విద్యార్థినులు

## మొదటి రోజు పరీక్షలు ప్రశాంతం

జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి రోజు బుధవారం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తొలి రోజు మొదటి సంవత్సరం విద్యార్థులు తెలుగు, సంస్కృతం పరీక్షలు రాశారు. కేంద్రాలకు గంట ముందుగానే చేరుకున్నారు. క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. జిల్లా వ్యాప్తంగా 8,177 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 7,937మంది హాజరు కాగా 240 మంది గైర్హాజరయినట్లు ఇంటర్ నోడల్ అధికారి శంకర్ తెలిపారు.

– అనంతగిరి



వికారాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పోలీసుల బందోబస్తు

## 5 మండలాలు | 60 గ్రామాలు

## సెమీ అర్బన్ పరిధిలోకి..

- పూడూరు, నవాబుపేట మండలాల్లో ఎక్కువ భాగం
- ఇప్పటికే 'వుడా' పేరుతో 190 జీఓను విడుదల చేసిన ప్రభుత్వం
- ఊపందుకోనున్న అభివృద్ధి



**వికారాబాద్:** సెమీ అర్బన్ పరిధిలోకి మన జిల్లా కూడా రావడం చర్చకు దారితీసింది. గతంలో ఏడు జిల్లాలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉండగా.. ప్రభు త్వం తీసుకున్న తాజా నిర్ణయంతో హెచ్‌ఎండీఏ 11 జిల్లాలకు విస్తరించింది. ఇందులో వికారాబాద్ జిల్లా పరిధిలోని ఐదు మండలాలు ఉండనున్నాయి. ట్రిపుల్ ఆర్‌కు ఐదు కిలో మీటర్ల అవతలి వరకు హెచ్‌ఎండీఏ పరిధి విస్తరించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆ పరిధిలోకి మన జిల్లా కూడా వచ్చేసింది. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లా అభివృద్ధిలో మాత్రం అట్టడుగున నిలిచిపోయింది. హైదరాబాద్‌కు రెండు మూడు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లాలతో కూడా మన జిల్లా పోటీ పడలేని స్థితిలో ఉండిపోయింది. నాయకత్వ సమస్యతో కొట్టుమిట్టాడుతూ వస్తున్న జిల్లా నుంచి ఒకే సారి సీఎం, స్పీకర్ రూపంలో ప్రభుత్వంలో ఇద్దరు నేతలు కీలకంగా ఉండటం కూడా జిల్లాకు కలిసొచ్చింది. జిల్లా నుంచి సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి ముందుగా కడా (కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేశారు. ఇటీవల జిల్లా సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక జీఓను విడుదల చేసింది. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ఇటీవల 190 జీఓను విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో జిల్లాలో అభివృద్ధి మరింత ఊపందుకోనుంది. వుడా పరిధిలోకి నాలుగు మున్సిపాలిటీలు (వికారాబాద్,తాండూరు, పరిగి, కొడంగల్) తోపాటు 493 రెవెన్యూ గ్రామాలు రానున్నాయి.

### హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చే గ్రామాలివే.!

హెచ్‌ఎండీఏ పరిధిలోకి జిల్లాలోని ఐదు మండలాలు 50నుంచి 60 గ్రామాలు వచ్చే అవకాశం ఉంది. ఏఏ మండలాలు, ఏయే గ్రామాలు దీని పరిధిలోకి వస్తాయనే దానిపై చర్చ మొదలైంది. రీజనల్ రింగ్‌రోడ్డు మొదటి అలైన్‌మెంటే ఖరారైతే 10 నుంచి 20 గ్రామాలు మాత్రమే హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చే అవకాశం ఉంది. తర్వాత ప్రతిపాదించిన రెండో అలైన్‌మెంట్ ఖరారైతే 50నుంచి 55 గ్రామాల వరకు ఈ పరిధిలోకి రానున్నాయి. జిల్లా పరిధిలోని నాలుగు మండలాలను కలుపుతూ ట్రిపుల్ ఆర్ వెళ్తుంది. ఐదు కిలోమీటర్లు వెలుపలి వరకు హెచ్‌ఎండీఏ విస్తరించాలనే ప్రతిపాదన నేపథ్యంలో మరో మండలం పరిగికి చెందిన కొన్ని గ్రామాలు కూడా దీని పరిధిలోకి వచ్చే అవకాశం లేకపోలేదు. మన జిల్లాకు చెందిన పూడూరు, నవాబుపేట మండలాల పరిధిలోని పది గ్రామాలపైగా ఈ పరిధిలోకి వస్తుండగా వికారాబాద్, మోమిన్‌పేట మండలాల పరిధిలోని నాలుగు నుంచి ఐదు గ్రామాలు రానున్నాయి. ప్రాథమిక అంచనా ప్రకారం పూడూరు మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్, కంకల్, ఖుద్బుల్లాపూర్, మన్నెగూడ, చింతల్‌పల్లి, పుడుగుర్తి, తుర్కయెన్కెపల్లి, రేగడిమామిడిపల్లి, అంగడిచిట్టెంపల్లి, కండ్లపల్లి, చన్గొముల్, నిజాంపేట్‌మేడిపల్లి, పోతిరెడ్డిగూడ, మరియాపూర్, చీలాపూర్, కొత్తపల్లి, తిమ్మాపూర్, మిట్టకంకల్, మేడికొండ, మేడిపల్లి, మిర్జాపూర్, పూడూరు, గ్రామాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి రానున్నాయి. నవాబుపేట మండల పరిధిలోని అక్నాపూర్, పులిమామిడి , నారెగూడ, గంగ్యాడ, గుబ్బడిఫత్తేపూర్, ముబారక్‌పూర్, పూలపల్లి, గొల్లగూడ, లింగంపల్లి, ఎల్లకొండ, మైతాప్‌ఖాన్‌గూడ, మాదిరెడ్డిపల్లి, సాయన్నగూడ, వట్టిమీనెపల్లి, రామన్నగూడ, చించల్‌పేట్, అత్తాపూర్, చిట్టిగిద్ద, నవాబుపేట గ్రామాలు ఈ పరిధిలోకి రానున్నాయి. ఇక వికారాబాద్ మండల పరిధిలోని సిద్దులూర్, కొటాలగూడ, లాల్‌సింగ్ తండ, పులుసుమామిడి, పీరంపల్లి, మోమిన్‌పేట మండల పరిధిలోని చీమల్‌ధరి, బాల్‌రెడ్డిగూడ, చక్రంపల్లి గ్రామాలు ఈ పరిధిలోకి రానున్నాయి.

మోమిన్‌పేట: స్వామివారిని దర్శించుకుంటున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు



## ధైవభక్తి అలవర్చుకోవాలి

- స్పీకర్ ప్రసాద్‌కుమార్

**అనంతగిరి:** వికారాబాద్ పట్టణంలోని శ్రీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ మాధవానంద సరస్వతి స్వామి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించాలన్నారు. భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. సమాజ హితం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు మహిపాల్‌రెడ్డి, ముత్తాహర్ షరీఫ్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి,నాయకులు మల్‌రెడ్డి, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మల్లికార్జునస్వామి ఆలయంలో..**

**మోమిన్‌పేట:** ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవర్చుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం మోమిన్‌పేట మండలం దుర్గంచెర్వు గ్రామంలోని భ్రమరాంబిక మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తితో మానసిక ప్రశాంతత పొందవచ్చని తెలిపారు. ఆయన వెంట మర్పల్లి మార్కెటు కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు నరోత్తంరెడ్డి, శ్రీనివాస్, వెంకటేశం తదితరులు ఉన్నారు.

**విద్యార్థినికి న్యాయం జరిగేలా చూస్తాం**

**అనంతగిరి:** ఉపాధ్యాయుల తీరు కారణంగా భవనం పైనుంచి దూకి గాయపడిన బాలిక తబితను బుధవారం స్పీకర్ ప్రసాద్ కుమార్ పరామర్శించారు. ఇటీవల కొత్తగడి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మహిళా టీచర్లు విద్యార్థి తబితను సూటిపోటి మాటలతో ఇబ్బంది పెట్టిన విషయం తెలిసిందే. బుధవారం వికారాబాద్ ఆస్పత్రికి వచ్చిన బాలికను స్పీకర్ పరామర్శించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థినికి ధైర్యం చెప్పారు.



తబితతో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్



దోమ: బొంపల్లి ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ విద్యను పరిశీలిస్తున్న బెంగళూరు టీం సభ్యులు, డీఈఓ రేణుకాదేవి

## కృత్రిమ మేధపై అవగాహన పెంచాలి

- బెంగళూరు ఏక్ స్టెప్ ఫౌండేషన్ టీం సభ్యురాలు ఆనంది

**పరిగి:** ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధ(ఏఐ) తరగతులు నిర్వహించడం మంచి నిర్ణయమని బెంగళూరుకు చెంది ఏక్ స్టెప్ ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. బుధవారం మండలంలోని గడిసింగాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న ఏఐ పాఠ్యాంశాలను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే ఏఐ విద్యను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి, మండల విద్యాధికారి గోపాల్, ఏఎంఓ రామ్ మస్తాన్, ప్రధానోపాధ్యాయుడు వెంకట్, అనంతరావు పాల్గొన్నారు.

**బొంపల్లి ప్రాథమిక పాఠశాలలో..**

**దోమ:** విద్యార్థులకు కృత్రిమ మేధ(ఏఐ)పై అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని బెంగళూరుకు చెందిన ఏక్ స్టెప్ ఫౌండేషన్ సభ్యురాలు ఆనంది అన్నారు. బుధవారం దోమ మండలం బొంపల్లి ప్రాథమిక పాఠశాలను డీఈఓ రేణుకాదేవితో కలిసి బృందం సభ్యులు సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న కంప్యూటర్ విద్యను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒకటో తరగతి నుంచే కృత్రిమ మేధపై అవగాహన కల్పించాలనే ప్రభుత్వం నిర్ణయం ఎంతో మంచిదన్నారు. ప్రతి విద్యార్థికీ చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలన్నారు. ఏఐపై అవగాహన పెంచాలంటే ప్రత్యేక సిబ్బంది ఉండాలని పాఠశాల ఉపాధ్యాయురాలు స్వప్న బెంగళూరు టీం సభ్యుల దృష్టికి తెచ్చారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు వివరించి సిబ్బందిని నియమించేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఏఎంఓ రామ్‌మస్త, టెక్నికల్ పర్సన్ శేఖర్, ఎంఈఓ వెంకట్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం షఫీ, ఉపాధ్యాయులు సావిత్రి, స్వప్న, జరీనాబేగం, వెంకటయ్య, ముత్యప్ప, అనంతయ్య, సీఆర్‌పీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నాగరాజుకు డాక్టరేట్



**మంచాల:** మంచాలకు చెందిన జాంగ్లే నాగరాజు బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. జాంగ్లే శివయ్య, జయమ్మ దంపతుల కుమారుడైన ఆయన యూనివర్సిటీలో ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ చదివారు. ప్రొఫెసర్ కె.రమేశ్‌బాబు పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు గానూ ఆయనను అవార్డు వరించింది. నిరుపేద కుటుంబానికి చెందిన నాగరాజు గణిత శాస్త్రంలో డాక్టరేట్ సాధించడంపై మంచాలవాసులు హర్షం వ్యక్తంచేశారు.

## దేశవ్యాప్తంగా బీజేపీకి అనుకూల వాతావరణం

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**బడంగ్‌పేట్:** కార్యకర్తల శ్రమతో బీజేపీకి దేశవ్యాప్తంగా అనుకూల వాతావరణం నెలకొందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పార్టీ బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షులు 1, 2 రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండా దిమ్మె నిర్మాణానికి భూమి పూజ చేశారు. మహేశ్వరం ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములుయాదవ్‌తో కలిసి పార పట్టి మట్టి తీశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ మరింత పుంజుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. చేవేళ్ల పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. అనంతరం 23వ డివిజన్‌లోని శివసాయినగర్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్య పరిశీలించారు. కమిషనర్ సరస్వతితో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి, సామ సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, చిత్రం శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పూర్తి చేయండి

- వికారాబాద్, నారాయణపేట కలెక్టర్లు ప్రతీక్ జైన్, సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

**కొడంగల్:** నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని కడా కార్యాలయంలో రెండు జిల్లాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి పనులను ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలన్నారు. బీసీ గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాల నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో మంజూరైన నిర్మాణాలకు టెండర్లు పిలవాలన్నారు. కొడంగల్‌లో ప్రభుత్వ ఆసుపత్రి భవనం, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నిర్మాణ పనులను కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. రోడ్ల విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మిషన్ భగీరథ పథకం కింద ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై గుంతలు లేకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, నారాయణపేట ఆర్డీఓ రామచందర్, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వసంత్ నాయక్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ లీలావతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**భవన నిర్మాణాలకు స్థల పరిశీలన**

**దుద్యాల్:** మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కలెక్టర్ ప్రతీక్ జైన్ పర్యటించారు. దుద్యాల్‌లో సమీకృత భవన నిర్మాణాలకు స్థల పరిశీలన చేశారు. మండల కేంద్రం నుంచి అల్లిఖాన్‌పల్లి వరకు వేస్తున్న బీటీ రోడ్డు పనులను, గౌరారం గ్రామంలో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పంచాయత్ రాజ్ ఈఈ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

**అధికారులతో సమీక్ష**

**అనంతగిరి:** జిల్లాలో నేషనల్ హైవే, వివిధ ప్రాజెక్టుల కోసం భూ సేకరణ, పరిహారం పంపిణీపై బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతుల సమ్మతితో భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర ప్రసాద్, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

### పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

- కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే వినతి

**కొడంగల్:** నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కోరారు. బుధవారం ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కొడంగల్ కడా కార్యాలయానికి వచ్చిన కలెక్టర్‌ను ఆయన కలిశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని కోరారు. పనులు చేసిన ప్రజా ప్రతినిధులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. ఆయా గ్రామాల సర్పంచులు లక్షలాది రూపాయల పెట్టుబడి పెట్టి సీసీ రోడ్లు, ప్రభుత్వ భవనాలు నిర్మించినట్లు చెప్పారు. వాటికి సంబంధించిన బిల్లులు ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. సదరు బిల్లులను చెల్లించి ప్రజాప్రతినిధులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మధుయాదవ్, నాయకులు మహిపాల్‌రెడ్డి, దేశ్యా నాయక్, శేరి నారాయణ రెడ్డి, రమేష్‌బాబు, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కార్యక్రమంలో గిరిజన నాయకులు

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గిరిజన సంఘం నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. కొడంగల్ పట్టణ శివారులో నిర్మిస్తున్న బంజారా భవనానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.3.65 కోట్లు మంజూరు చేయడంతో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పాలతో అభిషేకించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌కు, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సేవా లాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శివరామ్ చౌహాన్, సంతోష్ నాయక్, శంకర్ నాయక్, డాక్యా నాయక్, తార్యా నాయక్, పాండు నాయక్ శివ రాథోడ్, రాజు నాయక్ నరేష్ నాయక్ పాల్గొన్నారు.

### భగీరథ పైపునకు లీకేజీ



ఎన్కేపల్లికి వెళ్లే దారిలో వృథాగా పోతున్న భగీరథ నీరు

మోమిన్‌పేట: మొరంగపల్లి నుంచి ఎన్కేపల్లికి వెళ్లే రహదారిలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు రెండు వేర్వేరు ప్రదేశాలలో లీకేజీలు ఏర్పడి నీరంతా వృథాగా పోతుంది. దీంతో ఎన్కేపల్లిలో వారం రోజులుగా తాగు నీరు సరిపడా అందడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని పేర్కొంటున్నారు. ఉన్నాతాధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతులు చేసి నీటి వృథాను అడ్డుకోవాలని కోరుతున్నారు.

### సేవాలాల్ మహరాజ్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ



పూజ చేస్తున్న ఆలిండియా బంజారా సేవా సంఘ్ సభ్యులు

అనంతగిరి: ఆలిండియా బంజారా సేవా సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం వికారాబాద్‌లోని మహావీర్ ఆస్పత్రికి వెళ్లే ప్రధాన చౌరస్తా వద్ద సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పరుశురాంనాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు నరేందర్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు రమేష్ నాయక్, నాయకులు బాబులాల్ జాదవ్, విజయ్‌కుమార్‌నాయక్, పరుశురాంజాదవ్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన బాలుడు నవీన్

కుల్కచర్ల: ముందు వెళ్తున్న బైక్‌ను సడన్‌గా ఆపడంతో వెనుక వస్తున్న మరో బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం కుల్కచర్ల మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. దోమ మండలం మల్లేపల్లికి చెందిన అంజిలయ్య తన సోదరి నర్సమ్మ, కుమారుడు నవీన్‌తో కలిసి కుల్కచర్ల నుంచి దాదాపూర్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బండవెల్కిచర్ల గ్రామ శివారులో ముందు వెళ్తున్న బైక్ సడెన్‌గా నిలిపివేయడంతో వెనుక వస్తున్న అంజిలయ్య బైక్ అట్టి బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో అంజిలయ్య, నవీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సడన్‌గా బైక్ ఆపిన వ్యక్తికి కూడా గాయాలైనట్లు తెలిసింది.

# వంద శాతం దిశగా..

- జీపీ పన్నుల వసూలుపై అధికారుల ప్రత్యేక దృష్టి
- దోమలో రూ.47 లక్షలు లక్ష్యం
- ఇప్పటివరకు ఖజానాలో రూ.36 లక్షలు జమ



దాదాపూర్‌లో ఇంటి పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

దోమ: గ్రామ పంచాయతీలలో ఇంటి పన్ను వసూలు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పన్ను వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఇంటింటికి వెళ్తున్నారు. ఈ నెల 31న ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో అప్రమత్తమయ్యారు. మరో పక్క వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఉన్నతాధికారులు సైతం ఆయా సమావేశాల్లో పంచాయతీ అధికారులకు సూచిస్తున్నారు.

**మండలంలో 75 శాతం పూర్తి**

దోమ మండల వ్యాప్తంగా మొత్తం 36 గ్రామ పంచాయతీలున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.47.91 లక్షలు పన్నులు జీపీలకు సమకూర్చాల్సి ఉండగా, అందులో రూ.36.27 లక్షలు వసూలయ్యాయి. మొత్తంగా 75 శాతం పూర్తి చేసినట్లు పంచాయతీ అధికారులు చెప్పారు. మిగతా పన్ను వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు.

**ఇంటింటికి తిరుగుతూ**

ప్రభుత్వం చేపడుతున్న పన్ను వసూళ్లకు పల్లె వాసులు సైతం మద్దతుగా నిలుస్తున్నారు. గ్రామాభివృద్ధిలో ఇంటి పన్ను కీలకపాత్ర పోషిస్తుండగా.. మెజార్టీ ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, మంచినీరు, మురుగు నాళాలను శుభ్రం చేయడం వంటి పనులకు ఈ పన్నులు ఎంతో ఉపయోగపడతాయి. అయితే వాటిని చెల్లించుకోవడంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఇంటింటికి తిరుగుతూ వసూలు చేస్తున్నారు.

### విధిగా పన్నులు చెల్లించాలి

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ విధిగా పన్నులు చెల్లించాలని చౌడాపూర్ మండలంలోని మరికల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన గ్రామంలో ఇంటి పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దుకాణదారులు తమ అనుమతులను రెన్యూవల్ చేసుకోవడంతో పాటు పన్నులను సకాలంలో చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తుల నుంచి పన్నులు వసూలు చేస్తున్న కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

### ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం



ఇంటి పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రతి ఇంటికి వెళ్లి అధికారులు నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేసేందుకు శ్రద్ధ తీసుకుంటున్నాం. పన్నుల వసూలుకు గ్రామస్తులు సహకరిస్తున్నారు. త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– మీన, పంచాయతీ కార్యదర్శి, బొంపల్లి

### బాధ్యతగా స్పందన



గ్రామాభివృద్ధిలో ఇంటి పన్ను పాత్ర ఎంతో కీలకంగా మారుతుంది. అందుకు ప్రతి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నును ప్రజల వద్ద నుంచి వసూళ్లు చేస్తున్నాం. గ్రామస్తులు సైతం బాధ్యతగా స్పందించి పన్నులు చెల్లిస్తున్నారు.

– రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, దాదాపూర్

### శత శాతం పూర్తి చేస్తాం



ఈ ఏడాది పన్ను వసూలు నేటికి 75 శాతం దాటింది. పన్నులు రాబట్టడంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 31న లోపు శత శాతం పూర్తి చేస్తాం.

– పి.రాజేశ్, ఇన్‌చార్జి ఎంపీఓ, దోమ

# సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మరికల్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: సబ్బండ వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్, పుర్సంపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో బీటీ రోడ్ల ప్రారంభోత్సవం, మరికల్‌లో ఎస్సీ, బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు భూమిపూజ, చౌడాపూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల ఫలితాలు చేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రతి గ్రామంలో రహదారులను ఏర్పాటు చేసి రవాణావ్యవస్థను అభివృద్ధి చేస్తామన్నారు. అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి ప్రత్యేకమైన నిధులతో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అనుసరించి ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్‌శర్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు నరసింహనాయక్, తహసీల్దార్ ప్రభులు, ఎంపీడీఓ సోమలింగం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సాంకేతికతపై పట్టు సాధించాలి



సైన్స్ ఫేయిర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

కుల్కచర్ల: విద్యార్థులు సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలని చౌడాపూర్ ఎంపీడీఓ సోమలింగం, ఎంఈఓ రాంచందర్ పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్ మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో పీఎం శ్రీ సైన్స్‌ఫేయిర్, ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠ్యంశాలను చదవడంతో పాటుగా టెక్నికల్ అంశాలపై సైతం నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 89 రకాలైన సైన్స్ ప్రయోగాలు, 25 రకాల వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కొత్త అలివేలు, కార్యదర్శి రాజిరెడ్డి, సీఆర్పీలు రఘు, విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గౌస్ నదీమ్, సురేష్ కుమార్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

# బోరు మోటారు తీసేందుకు వెళ్లి..

నీటిలో మునిగి వ్యక్తి మృతి



మృతుడు తిరుపతయ్య

పూడూరు: బావిలో చెడిపోయిన బోరు మోటారును తీసేందుకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఖుత్బుల్లాపూర్‌కు చెందిన జోగు తిరుపతయ్య (25)ను ఆదే గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ జోగు రామకృష్ణ, వాటర్‌మెన్ రాములు కలిసి చేదరుబావిలో బోరు మోటారు ఉంది తీయాలని తెలపడంతో తిరుపతయ్య బావిలోకి దిగాడు. నీటిలోకి వెళ్లి ఎంత సేపటికీ బయటికి రాకపోవడంతో అనుమానంతో పంచాయతీ కార్యదర్శి రాజేందర్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే గ్రామస్తులు బావిలోకి దిగి తిరుపతయ్యను బయటికి తీశారు. అప్పటికే తిరుపతయ్య మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి అన్న జోగు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### జీవాలను ఎత్తుకెళ్లిన దుండగులు

నవాబుపేట: పశువుల పాకలో ఉన్న మేకలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన సంఘటన మండలంలోని మీనపల్లికలాన్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శీలపురం నర్సింలుకు చెందిన రెండు మేకలు, ఒక గొర్రె పోతును మంగళవారం సాయంత్రం గ్రామ శివారులో ఉన్న పాకలో కట్టేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం పాక దగ్గరకు వెళ్లి చూడగా కనిపించలేదు. సుమారు రూ.35 వేల విలువగల జీవాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### పరీక్ష కేంద్రం చూసేందుకు వెళ్తూ..

రోడ్డు ప్రమాదానికి గురైన ఇంటర్ విద్యార్థి

తాండూరు టౌన్: తెల్లారితే పరీక్ష ఉండటంతో సెంటర్ ఎక్కడ ఉందో చూసేందుకు బైకుపై వెళ్తున్న ఓ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. తాండూరు మండలం సిరిగిరిపేట్‌కు చెందిన శ్రీకాంత్ అనే విద్యార్థి తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్నాడు. పరీక్ష కేంద్రం ఎక్కడ ఉందో చూసేందుకు బైకుపై ఇందిరాచౌక్ నుంచి హైదరాబాద్ రోడ్డు మార్గంలో వెళ్తుండగా.. రాయల్‌కాంటా వద్ద టర్నింగ్ తీసుకుంటున్న జనగాం గ్రామానికి చెందిన పట్నం సుధాకర్ బైకు ఢీకొన్నాయి. దీంతో కిందపడిన శ్రీకాంత్ తలకు తీవ్ర గాయమైంది. సమాచారం మేరకు 108లో తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఈ ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని పట్టణ పోలీసులు తెలిపారు.

### హుండీ చోరీకి విఫలయత్నం

కొందుర్గు: ఆలయంలో చోరీకి యత్నించిన ఓ దుండగుడిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల గ్రామం సోమలింగేశ్వర స్వామి వారి ఆలయంలో చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి సాయికుమార్ బుధవారం ఉదయం ఆలయ పరిసరాల్లో ఎవరూ లేని సమయంలో హుండీలోని డబ్బులు దొంగిలించేందుకు యత్నించాడు. అటుగా వెళ్తున్న గ్రామస్తులు గమనించి అతన్ని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ వీరన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నీటి ఎద్దడి రానివొద్దు

డీఎల్‌పీఓ సంధ్యారాణి



కార్యదర్శులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ సంధ్యారాణి

కుల్కచర్ల: సమస్యల పట్ల ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని డీఎల్‌పీఓ సంధ్యారాణి, ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. బుధవారం కుల్కచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ... ప్రస్తుతం వేసవికాలం వస్తున్న నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నీటి సౌలభ్యాన్ని బట్టి గ్రామ పరిధిలోని నీటి వనరులను ఉపయోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా మార్చి చివరి వారం వరకు టాక్స్ కలెక్షన్లు వందశాతం పూర్తయ్యేలా కార్యదర్శులు పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌ఐవీపై అప్రమత్తత ముఖ్యం



చన్గోముల్ సబ్ సెంటర్ వద్ద అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పూడూరు: ప్రతిఒక్కరూ హెచ్‌ఐవీ పరీక్షలు చేసుకోవాలని వైఆర్‌జీకే జోనల్ సూపర్‌వైజర్ రాములు తెలిపారు. బుధవారం వైఆర్‌జీ కేర్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని చన్గోముల్ హెల్త్ సబ్ సెంటర్‌లో 53 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ ఉన్నవారు ఆందోళన చెందరాదని, వారి కోసం ఉచితంగా మందులు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో అనుమానం ఉన్న వారు టీబీతో పాటు సుఖ వ్యాధుల కోసం సబ్ సెంటర్‌లో పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. హెచ్‌ఐవీ వచ్చిన వ్యక్తి జీవిత కాలం బతకాలంటే సమీపంలోని ఏఆర్‌టీ కేంద్రంలో అందుబాటులో ఉన్న మందులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ, లింక్ వర్కర్ సుధా, తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల మరమ్మతులు చేపట్టాలి



రాయపోల్ చెరువును పరిశీలిస్తున్న మత్స్యకార్మిక సంఘం నాయకులు

టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ

ఇబ్రహీంపట్నం రూరల్: చెరువులు, కుంటల్లో నీరు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో వాటి మరమ్మతులు చేపట్టాలని రాష్ట్ర మత్స్యకారుల, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండల పరిధిలోని రాయపోల్‌లో ముదిరాజ్ సంఘం కార్యాలయం వద్ద మత్స్యకారుల సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. చెరువు నిండినా.. లీకేజీల వల్ల నీరు బయటకు పోతోందన్నారు. దీంతో మత్స్యకారు వృత్తి దారులు ఆగమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.10 లక్షలు బడ్జెట్ కేటాయించి చెరువుల్లో కంప చెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, కాలుష్యం వల్ల మత్స్య సంపద చనిపోతే ఎలాంటి పరిహారం ఇవ్వడం లేదన్నారు. దేశ వ్యాప్తంగా మత్స్యకారులకు 50 సంవత్సరాలు నిండిన వారికి వృద్ధాప్య పెన్షన్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శంకర్, రాయపోల్ సొసైటీ అధ్యక్షుడు మైలారం యాదయ్య, కార్యదర్శి రమేష్, పుల్లయ్య, మండల నాయకులు సురేందర్ పాల్గొన్నారు.

# సద్దుమణిగిన గోశాల వివాదం



గోశాలను ఆలయానికి అప్పగిస్తున్నట్లు ఒప్పంద పత్రాన్ని చైర్మన్‌కు అందజేస్తున్న గోపాలకృష్ణ

ఆలయానికే అప్పగిస్తున్నట్లు ఒప్పందపత్రం అందజేత

మీర్‌పేట: జిల్లెలగూడలోని మత్స్యావతార వేంకటేశ్వరస్వామి ఆలయంలోని గోశాల విషయంపై వివాదం చోటు చేసుకుంది. గోపాలకృష్ణ అనే వ్యక్తి కొన్నేళ్లుగా ఆలయంలో గోశాల నిర్వహిస్తున్నాడు. గోశాలకు సంబంధించిన విషయాలు ఆలయ అధికారులకు తెలుపకపోవడంతో గోశాలను తిరిగి అప్పగించాలని అధికారులు, మాజీ ధర్మకర్తలు గోపాలకృష్ణను పలుమార్లు కోరినా ఆయన నిరాకరించాడు. దీంతో బుధవారం గోపాలకృష్ణ, అతనికి మద్దతుగా స్థానిక బీజేపీ నాయకులు ఆలయం వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్ఐ రాజశేఖర్ ఇరువర్గాల వారిని సముదాయించారు. అనంతరం ఆలయ చైర్మన్ సంజయ్ గోపాల్‌సింగ్ సైంచర్, ఈఓ శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు గోశాల నిర్వాహకుడు గోపాలకృష్ణ, స్థానిక నాయకులతో మాట్లాడటంతో వివాదం సద్దుమణిగింది. కాగా గోశాల నిర్వహణ బాధ్యతలను ఆలయానికే అప్పగిస్తున్నట్లు గోపాలకృష్ణ అందరి సమక్షంలో ఒప్పంద పత్రం అందజేశారు.

# అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

పీఅండ్‌టీ కాలనీలో అనుమతి లేని నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

బండ్లగూడ: అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని నేలమట్టం చేస్తామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర హెచ్చరించారు. కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను బుధవారం మున్సిపల్, టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా సెట్ బాక్స్‌లు లేకుండా అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నామన్నాని కమిషనర్ శరత్‌చంద్ర స్పష్టం చేశారు. అక్రమ కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని వాటిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ప్రజలందరూ నిబంధనలకు అనుగుణంగా తమ నిర్మాణాలను చేపట్టుకోవాలని సూచించారు. నిర్మాణాలు చేపట్టే సమయంలో పూర్తి అనుమతులు తీసుకోవాలని... ఆ తర్వాతే నిర్మాణాలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

మెగా ఎంఎస్ఎంఈ క్యాంపులో రుణాల అందజేత



రుణ మంజూరు పత్రాలను అందజేస్తున్న బ్యాంకు అధికారులు

శంషాబాద్ రూరల్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ క్యాంపులతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహంతో పాటు మేక్ ఇన్ ఇండియాకు నూతన శక్తిని ఇస్తుందని జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ఎం.శ్రీలక్ష్మీ అన్నారు. బ్యాంకు సైఫాబాద్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మండలంలోని ముచ్చింతల్‌లో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో బుధవారం మెగా ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ క్యాంపు నిర్వహించారు. ఎంఎస్ఎంఈ ఉత్పాదనలపై బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కల్పించారు. సుమారు రూ.వంద కోట్లకు సంబంధించిన రుణ మంజూరు పత్రాలను 50 మంది ఖాతాదారులకు అందజేశారు. ఎంఎస్ఎంఈ సెక్టార్ రుణాలు దేశంలో 30 శాతం జీడీపీతో దేశానికి వెన్నుముకంగా ఉన్నామని ఎంఎస్ఎంఈ వెర్టికల్ సీఓ ముంబయి జనరల్ మేనేజర్ జి.కె.సుధాకర్‌రావు అన్నారు. వివిధ రకాల ఉత్పత్తుల తయారీ రంగంలో 45 శాతం వాటాతో పాటు దేశంలో 65 శాతంపైగా యువతకు జీవనోపాధి కల్పిస్తుందన్నారు. ఇలాంటి మెగా క్యాంపులను దేశంలోని 157 కేంద్రాల్లో మార్చి 3 నుంచి 7 వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు హైదరాబాద్ జనరల్ మేనేజర్ ఆర్.ఎల్.పట్నాయక్, డీజీఎం సోనాలిక, ఏజీఎంలు రవి, జగదీశ్, లేపాక్షి తదితరులు పాల్గొన్నారు.

# ఆగిన రోడ్డు.. తప్పని తిప్పలు

గడ్డమీది గంగారం వద్ద రోడ్డు పనులు అడ్డుకున్న అటవీ అధికారులు



కుక్కింద ఉన్నత పాఠశాల నుంచి గడ్డమీది గంగారం వరకు వేసిన కంకర రోడ్డు

ధారూరు: పూర్తిగా పాడైన రహదారిని తిరిగి పునర్నిర్మిస్తుండగా అనుమతులు లేవంటూ అటవీ అధికారులు అడ్డుకున్న ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్ట్ నుంచి గడ్డమీది గంగారం, కుక్కింద ఉన్నత పాఠశాల, మున్నూరుసోమారం గ్రామం మీదుగా బుగ్గ శివాలయం దేవాలయం వరకు పాడైన రోడ్డును ఎంఆర్ఆర్ గ్రాంట్ ద్వారా విడులైన రూ.2.82 కోట్లతో పునర్నిర్మించడానికి నిధులు మంజూరు అయ్యాయి. కాంట్రాక్టర్ ముందుగా కుక్కింద ఉన్నత పాఠశాల నుంచి గడ్డమీది గంగారం గ్రామం వరకు కంకర వేశాడు. మధ్యలో ఉన్న కల్వర్టులను కొత్తగా నిర్మించాడు. గడ్డమీది గంగారం నుంచి కోట్‌పల్లి ప్రాజెక్టు వరకు రోడ్డు పనులు చేస్తుండగా ఫారెస్టు అధికారులు తమ భూభాగం అంటూ నిలిపివేశారు. నెల రోజులుగా ముమ్మరంగా పనులు చేయించిన కాంట్రాక్టర్ అటవీశాఖ అభ్యంతరంతో పనులు మధ్యలోనే ఆపేశారు. గతేడాది సెప్టెంబర్ నుంచి ఇబ్బంది పడుతున్న తమకు తీవ్ర నిరాశ ఎదురైందని వాహనదారులు వాపోయారు.

**బస్సును నిలిపేశారు**

ఈ మార్గంలో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పగటి పూట ఎలాగో వెళుతున్నా రాత్రిపూట మాత్రం చుక్కలు కనిపిస్తున్నాయని వాపోతున్నారు. రోడ్డు బాగా లేదంటూ వికారాబాద్ నుంచి గడ్డమీది గంగారం వరకు నడిపే ఆర్టీసీ బస్సును సైతం ఆపేశారు. దీంతో కళాశాల, పాఠశాలలకు వెళ్లాల్సిన విద్యార్థుల బాధ వర్ణనాతీతం. వెంటనే రోడ్డు పూర్తి అయ్యేలా చొరవ చూపాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరుతున్నారు.

### త్వరలో పనులు ప్రారంభిస్తాం

రోడ్డును కొత్తగా వేయడం లేదు. ఇదే విషయాన్ని జిల్లా ఫారెస్టు అధికారి జ్ఞానేశ్వర్ దృష్టికి తీసుకెళ్లాం. పనులు తీసుకున్న కాంట్రాక్టర్ మోమిన్ ఖుర్దు నుంచి రాజాపూర్ వరకు ఉన్న అసంపూర్తి రోడ్డు పనులు చేశారు. త్వరలో ఈ రోడ్డును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తాం.

– శ్రీనివాసులు, పంచాయతీరాజ్ డీఈ